సాక్షి
అనంతపురం
బుధవారం ; 22 ; మే ; 2024



టన్ను చీనీ రూ.37 వేలు

అనంతపురం వ్యవసాయ మార్కెట్‌యార్డులో మంగళవారం టన్ను చీనీకాయలు గరిష్టంగా రూ.37 వేలు పలికాయి.



పిడుగుల కాలం..

పిడుగుల కాలం నేపథ్యంలో జాగ్రత్తగా ఉండాలని శాస్త్రవేత్తలు సూచిస్తున్నారు. దీంతో ప్రాణాలు కాపాడుకోవచ్చన్నారు. 8లో

గరిష్టం/కనిష్టం
38.4°/22.5°

జిల్లా అంతటా మంగవారం ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. ఉక్కపోత, వడగాల్పుల తీవ్రత కొనసాగింది. ఆకాశం మేఘావృతమై అక్కడక్కడా తేలికపాటి వర్షం కురిసింది.

న్యూస్‌రీల్

25న భారీ వర్షం!

అనంతపురం అగ్రికల్చర్: ఉమ్మడి అనంతపురం జిల్లా పరిధిలో ఈనెల 25న భారీ వర్షం కురిసే సూచనలు ఉన్నట్లు రేకులకుంట వ్యవసాయ పరిశోధనా స్థానం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ బి.సహదేవరెడ్డి, సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ జి.నారాయణస్వామి తెలిపారు. ప్రధానంగా అనంతపురం, గుత్తి, ఉరవకొండ డివిజన్లలో మంచి వర్షాలు పడవచ్చన్నారు.ధర్మవరం , కదిరి, హిందూపురం, కళ్యాణదుర్గం, మడకశిర, పెనుకొండ, రాయదుర్గం, తాడిపత్రి డివిజన్లలో వర్షపాతం బాగా నమోదు కావచ్చన్నారు. రాగల ఐదు రోజుల్లో గరిష్ట ఉష్ణోగ్రతలు 36.2 డిగ్రీల నుంచి 39.6 డిగ్రీలు, కనిష్టం 24.6 డిగ్రీల నుంచి 26.7 డిగ్రీల మధ్య ఉండవచ్చని తెలిపారు. గాలిలో తేమ ఉదయం 61 నుంచి 78, మధ్యాహ్నం 34 నుంచి 42 శాతం మధ్య రికార్డు కావచ్చన్నారు. నైరుతి దిశగా గంటకు 4 కిలోమీటర్ల వేగంతో గాలులు వీస్తాయని తెలిపారు. వారం రోజులుగా జిల్లా వ్యాప్తంగా వర్షాలు పడుతున్నందున ఖరీఫ్ సాగుకు రైతులు సమాయత్తం కావాలన్నారు. భూములు దుక్కులు చేసుకుని విత్తనాలు, ఎరువులు సిద్ధం చేసుకోవాలని సూచించారు.

24 నుంచి విత్తన పంపిణీ

- 18,750 క్వింటాళ్ల విత్తనానికి రిజిస్ట్రేషన్లు

అనంతపురం అగ్రికల్చర్: ఖరీఫ్‌లో రైతులకు రాయితీతో విత్తన పంపిణీ చేసేందుకు ఏర్పాట్లు చురుగ్గా సాగుతున్నాయి. ఈనెల 24 నుంచి జిల్లా వ్యాప్తంగా రైతు భరోసా కేంద్రాల ద్వారా విత్తన పంపిణీ చేసేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఇప్పటికే రైతులు ఆర్‌బీకేల్లో రిజిస్ట్రేషన్లు చేసుకుని తమ వాటా సొమ్ము చెల్లిస్తున్నారు. మంగళవారం నాటికి 21,226 మంది రైతులు 18,750 క్వింటాళ్లకు ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్లు చేసుకున్నట్లు వ్యవసాయశాఖ వర్గాలు తెలిపాయి. 40 శాతం రాయితీతో భూవిస్తీర్ణాన్ని బట్టి ఒక్కో రైతుకు గరిష్టంగా 90 కిలోలు (మూడు కిలోలు బస్తాలు) పంపిణీ చేయనున్నట్లు వెల్లడించారు.

నాణ్యమైన విత్తనాలు సరఫరా చేయాలి



వేరుశనగ విత్తన ప్రాసెసింగ్ యూనిట్‌ను తనిఖీ చేస్తున్న డీఏఓ ఉమామహేశ్వరమ్మ

గుత్తి: రైతు భరోసా కేంద్రాలకు నాణ్యమైన విత్తనాలను సరఫరా చేయాలని డీఏఓ ఉమామహేశ్వరమ్మ ఆదేశించారు. పట్టణంలోని వేరుశనగ విత్తన ప్రాసెసింగ్ యూనిట్ (పవన్ ఆగ్రో ఏజెన్సీ)ను మంగళవారం జిల్లా వ్యవసాయాధికారిణి (డీఏఓ) ఉమామహేశ్వరమ్మ తనిఖీ చేశారు. వేరుశనగ విత్తన కాయలు, రికార్డులను పరిశీలించారు. అనంతరం స్థానిక వైఎస్సార్ అగ్రీ ల్యాబ్‌ను ఆమె తనిఖీ చేశారు. కార్యక్రమంలో ఏడీఏ వెంకటరాముడు, ఏఓ ముస్తాక్ అహ్మద్, టెక్నికల్ ఏఓలు రాకేష్ నాయక్, మెహరన్నీషా బేగం, ఏఈఓ భగవాన్ తదితరులు పాల్గొన్నారు.

అంగరంగ వైభవం..



గోవింద నామస్మరణ మధ్య సాగుతున్న లక్ష్మీ చెన్నకేశవ స్వామి బ్రహ్మ రథోత్సవం

ధర్మవరం అర్బన్: అశేష భక్త జనసందోహం నడుమ ధర్మవరంలో లక్ష్మీచెన్నకేశవస్వామి బ్రహ్మ రథోత్సవం అంగరంగ వైభవంగా జరిగింది. గోవింద నామస్మరణతో పట్టణం మార్మోగింది. మంగళవారం శ్రీదేవి, భూదేవి సమేత చెన్నకేశవస్వామి ఉత్సవ విగ్రహాలు గజ వాహనంపై పురవీధులలో ఊరేగుతూ తేరుబజార్‌కు చేరుకున్నాయి. అనంతరం ప్రత్యేకంగా అలంకరించిన రథంపై స్వామి కొలువుదీరారు. ఉదయం 7 గంటలకు మడుగుతేరు, సాయంత్రం 4గంటలకు బ్రహ్మ రథోత్సవం నిర్వహించారు. మడుగుతేరు (రథోత్సవం)కు ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆలయ కమిటీ చైర్మన్ దాశెట్టి సుబ్రహ్మణ్యం, అర్చకులు ఎమ్మెల్యేకు ఘన స్వాగతం పలికారు. అనంతరం రథానికి పూజలు చేసిన ఎమ్మెల్యే మడుగుతేరును లాగారు. ప్రధాన అర్చకులు కోనేరాచార్యులు ప్రత్యేక పూజలు చేశారు. వేలాదిమంది భక్తులు రథం వద్దకు చేరుకుని టెంకాయలు కొట్టి మొక్కులు తీర్చుకున్నారు. సాయంత్రం 4 గంటలకు బ్రహ్మ రథోత్సవం ప్రారంభించారు. తేరుబజార్ నుంచి అంజుమన్ సర్కిల్ వరకూ భక్తులు ఉత్సాహంగా రథాన్ని లాగారు.

అన్నదాతకు ఆపన్నహస్తం

- ఏఎఫ్ ఎకాలజీ సెంటర్ చేయూత
- రైతు ఉత్పత్తిదారుల పరస్పర సహకార సంఘాల ఏర్పాటు
- దళారీ వ్యవస్థను అరికట్టే దిశగా అడుగులు
- వెన్నుదన్నుగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు

పగలనకా, రాత్రనకా శ్రమించే అన్నదాతలకు అరకొర ఆదాయం వస్తోంటే, దళారీలు మాత్రం రైతుల కష్టాన్ని సులువుగా దోచుకుంటున్నారు. దేశానికే అన్నం పెడుతున్న రైతన్న వెన్ను విరుస్తున్నారు. అయితే, ఈ దురవస్థను పోగొట్టి రైతన్నలకు లాభాలు దక్కేలా ఏఎఫ్ ఎకాలజీ సెంటర్ కృషి చేస్తోంది. రైతు ఉత్పత్తిదారుల పరస్పర సహకార సంఘాలు ఏర్పాటు చేసి, అన్నదాతకు ఆపన్నహస్తం అందిస్తోంది.





రైతు అంగడి ద్వారా వ్యవసాయ పనిముట్లు కొనుగోలు చేస్తున్న రైతులు, కుందుర్పి రైతు ఉత్పత్తిదారుల పరస్పర సహకార సంఘం సమావేశం (ఫైల్)

అనంతపురం: ఏఎఫ్ ఎకాలజీ సెంటర్ ఆధ్వర్యంలో జిల్లా వ్యాప్తంగా 8 మండలాల్లో ఇప్పటికే 16 పరస్పర సహాయక సహకార సంఘాలు ఏర్పాటు చేశారు. ధర్మవరం, రాప్తాడు, కూడేరు, ఆత్మకూరు, కుందుర్పి,శెట్టూరు, బెళుగుప్ప, కళ్యాణదుర్గం మండలాల్లో ఇవి ఏర్పాటయ్యాయి. ఒక్కో సంఘంలో 12 నుంచి 16 మంది సభ్యులు ఉంటారు. రూ.1,000 చెల్లిస్తే వాటాదారులుగా చేర్చుకుంటారు. ఇప్పటి దాకా 10 వేల మంది చేరారు.

ఉత్పత్తుల కొనుగోలు

రైతు సంఘాల్లో ఉన్న వాటాదారుల పంట ఉత్పత్తులను సంఘం ద్వారా కొనుగోలు చేసి, మార్కెట్‌లో విక్రయిస్తున్నారు. లాభాల్లో రైతుకు 50 శాతం బోనస్ కింద ఏడాదిలోనే తిరిగి చెల్లిస్తున్నారు. ఈ సంఘాలు ఏడాదికి రూ.10 కోట్ల వరకు వ్యాపారం నిర్వహిస్తుండడం గమనార్హం. గత ఆర్థిక సంవత్సరంలో అన్ని వ్యయాలు పోను రూ.10 లక్షల నికర ఆదాయం వచ్చింది. దీంతో పాటు సంఘం ద్వారా వ్యవసాయ పరికరాలు కొనుగోలు చేసి వాటాదారులకు అమ్మకాలు చేయడం, సీహెచ్‌సీ కింద రైతులకు బాడుగలకు ఇవ్వడం తదితర కార్యక్రమాలు చేపడుతున్నారు. ఇక.. వాటాదారులు పెరిగే కొద్దీ ఆదాయం పెరుగుతుండడంతో ఆ డబ్బును ఆస్తుల రూపంలోకి మారుస్తున్నారు. కళ్యాణదుర్గంలో ఇప్పటికే సహకార సంఘాల ద్వారా భూమిని కొనుగోలు చేశారు.

ప్రభుత్వాల సహకారం..

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కూడా పరస్పర సహాయక సంఘాలకు సహకారం అందిస్తున్నాయి. కుందుర్పి, కళ్యాణదుర్గం మండలాల్లో రూ.5.50 కోట్లతో కోల్డ్ స్టోరేజ్ గోదాములు నిర్మించి, వాటి నిర్వహణ బాధ్యతలను ఈ సంఘాలకు అప్పగించేలా చర్యలు తీసుకుంటున్నాయి. ఇక.. రైతులు తొలుత చెల్లించే రూ.1,000 ప్రవేశ సభ్యత్వం మొత్తం ఎంత అవుతుందో అంత మొత్తాన్ని 'నాబార్డు' ఆ సంఘానికి అందిస్తూ దన్నుగా నిలుస్తోంది. ఉచితంగా ట్రాక్టర్లు, పరికరాలను కూడా సరఫరా చేస్తుండడం గమనార్హం.

స్వతహాగా రైతు అంగళ్లు

రైతు ఉత్పత్తిదారుల పరస్పర సహాయక సహకార సంఘాల్లో వచ్చిన లాభాలను పోగు చేసి రైతు అంగళ్లను ఏర్పాటు చేశారు. వీటిలో రైతులకు అవసరమైన సైకిల్ వీడర్లు, డ్రిప్, విత్తనాలు, టార్పాలిన్లు, పారలు, దంతులు విక్రయిస్తున్నారు. సంఘంలో ఉన్న రైతులకు తక్కువ ధరకు, ఇతర రైతులకు బహిరంగ మార్కెట్ ధరకు అమ్ముతున్నారు. ఒక సంఘం పరిధిలోని అంగడిలో నెలకు రూ. 5 లక్షల వరకు వ్యాపారం జరుగుతోంది. ఇందులో సంఘానికి రూ. 50 వేల వరకు లాభం చేకూరుతోంది.

రైతు అంగడిలోనే విక్రయాలు



"మా సంఘం మంచి వ్యాపార కార్యక్రమాలు నిర్వహిస్తోంది. ముఖ్యంగా రైతు అంగడి వ్యాపారం లాభదాయకంగా ఉంది. వేరుశనగ, కందులు, ఉలవలు తదితర రైతులు పండించే పంటలను కొనుగోలు చేసి, అమ్ముతున్నాం. అలాగే, ప్రాసెసింగ్ చేసి రైతులకు విత్తనాలు అందజేస్తున్నాం.

– అంజినమ్మ, కోశాధికారి, రాప్తాడు రైతు ఉత్పత్తిదారుల సహకార సంఘం

సమష్టి కృషితోనే సత్ఫలితాలు



రైతు అంగడి ద్వారా మా వాటాదారులకు కావలసిన పనిముట్లను సరసమైన ధరకు ఇస్తాం. మా సంఘం తరపున మంచి వ్యాపార కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం. తొలుత రెండు గ్రామాల్లో మాత్రమే ఉండేవి. నేడు మా మండలంలోనే 27 గ్రామాలకు విస్తరించాం. సమష్టి కృషితోనే సత్ఫలితాలు వస్తాయని సంఘం ద్వారా నేర్చుకున్నాం.

– కుందుర్పమ్మ, కుందుర్పి రైతు ఉత్పత్తిదారుల పరస్పర సహాయక సంఘం లిమిటెడ్ అధ్యక్షురాలు

మరింత బలోపేతం చేస్తాం



కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో రైతు సహకార సంఘాలను బలోపేతం చేస్తున్నాం. రైతుల ద్వారా కొనుగోలు చేసిన ఉత్పత్తులను ఆహార ఉత్పత్తులుగా మార్చి విక్రయాలు చేపట్టేలా చర్యలు తీసుకుంటున్నాం. దీంతో సంఘాలకు, వాటాదారులకు మరిన్ని లాభాలు అందే అవకాశం ఉంటుంది.

– డాక్టర్ వైవీ మల్లా రెడ్డి, ఏ.ఎఫ్. ఎకాలజీ సెంటర్, అనంతపురం

ఎనిమిది మంది జిల్లా బహిష్కరణ

అనంతపురం: నేర ప్రవృత్తి కలిగిన ఎనిమిది మందిని ఎస్పీ సిఫారసు మేరకు జిల్లా నుంచి బహిష్కరించినట్లు కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి వి.వినోద్‌కుమార్ వెల్లడించారు.

ఆ ఎనిమిది మంది వీరే..

జిల్లా నుంచి బహిష్కరణకు గురైన వారి వివరాలను జిల్లా పోలీసు కార్యాలయం తెలియజేసింది. గుంతకల్లు శాంతినగర్‌కు చెందిన గడిమాబు అలియాస్ గాడి మాబు అలియాస్ సి. మాబు, అనంతపురం రాణి నగర్‌కు చెందిన కడపల వెంకట రాముడు అలియాస్ వెంకట రమణ అలియాస్ కోడి వెంకట రాముడు, గార్లదిన్నె మెయిన్ రోడ్డుకు చెందిన దూదేకుల అబ్దుల్ అలియాస్ అబ్దుల్లా, అనంతపురం బుడ్డప్ప నగర్‌కు చెందిన షికారి భగవాన్, బెళుగుప్ప మండలం గంగవరం గ్రామానికి చెందిన అంకే నారాయణ అలియాస్ అంకె నారాయణ స్వామి,అనంతపురం వేణుగోపాల్ నగర్‌కు చెందిన చాకలి చలపతి అలియాస్ మీసాల చలపతి, కంబదూరు మండలం గుండ్లపల్లి కాలనీ ఎరికల ముత్యాలప్ప అలియాస్ ముత్యాలు, అలియాస్ జొల్లోడు, కంబదూరుకు చెందిన ఎరికల శేఖర్ ఎరుకల రాజశేఖర్ బహిష్కరణ వేటు పడిన వారిలో ఉన్నారు.

స్ట్రాంగ్ రూముల వద్ద ప్రత్యేక కార్యనిర్వాహక మెజిస్ట్రేట్ల నియామకం

అనంతపురం అర్బన్: ఈవీఎంలు భద్రపరిచిన స్ట్రాంగ్ రూముల వద్ద పత్యేక కార్యనిర్వాహక మెజిస్ట్రేట్లను నియమించినట్లు కలెక్టర్ వినోద్‌కుమార్ తెలిపారు. ఇందుకు సంబంధించి వివరాలను మంగళవారం ఆయన తెలియజేశారు. స్ట్రాంగ్ రూముల వద్ద 24 గంటలూ షిఫ్టుల వారీగా ప్రత్యేక కార్యనిర్వాహక మెజిస్ట్రేట్లు పనిచేస్తారన్నారు. ఉదయం 6 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు హెచ్ఎన్ఎస్ఎస్ డీఈఈ రాఘవేంద్రరావు, మధ్యాహ్నం 2 నుంచి రాత్రి 10 గంటల వరకు నగర పాలక సంస్థ డీఈఈ సుభాష్ చంద్రబోస్, రాత్రి 10 నుంచి ఉదయం 6 గంటల వరకు అహుడా డీఈఈ రేవంత్ విధులు నిర్వర్తిస్తారని తెలిపారు. పెట్రోల్ బంకుల్లో పెట్రోల్, డీజిల్‌ను బాటిళ్లు, క్యానుల్లో పోయరాదని బంక్ యజమానులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశామన్నారు.

కౌంటింగ్‌కు ముగ్గురు పరిశీలకులు





మాట్లాడుతున్న కలెక్టర్ వినోద్‌కుమార్, చిత్రంలో జెడ్పీ సీఈఓ నిధియాదేవి, కార్పొరేషన్ కమిషనర్ మేఘ స్వరూప్, హాజరైన ఆర్ఓలు, పోలీసు అధికారులు

- చిన్న పొరపాటుకూ తావివ్వొద్దు
- కలెక్టర్ వినోద్‌కుమార్

అనంతపురం అర్బన్: 'చిన్నపాటి పొరపాటుకూ తావివ్వకుండా ఓట్ల లెక్కింపు ప్రక్రియను అత్యంత పకడ్బందీగా నిర్వహించాలి. కౌంటింగ్ కోసం జిల్లాకు ప్రత్యేకంగా ముగ్గురు పరిశీలకులను ఎన్నికల సంఘం నియమించింది. వారు ప్రతి అంశాన్ని సునిశితంగా పరిశీలిస్తారు.పోలింగ్ తరువాత అందిన ఫిర్యాదులను నిర్లక్ష్యం చేయకుండా త్వరితగతిన పరిష్కరించాలి' అని కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి వి.వినోద్‌కుమార్ సంబంధిత అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాలులో రిటర్నింగ్ అధికారులు, పోలీసు అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అనంతపురం అర్బన్, రాప్తాడు అసెంబ్లీ నియోజకవర్గాలకు సంబంధించి ఎన్నికల పరిశీలకునిగా మనీష్ సింగ్ వ్యవహరిస్తారన్నారు. ఉరవకొండ, కళ్యాణదుర్గం, శింగనమల అసెంబ్లీ నియోజకవర్గాలకు ఎన్నికల పరిశీలకునిగా అజయ్‌నాథ్ ఝ, రాయదుర్గం, తాడిపత్రి, గుంతకల్లు అసెంబ్లీ నియోజకవర్గాలకు అజయ్‌కుమార్‌ను కౌంటింగ్ పరిశీలకులుగా నియమించారని చెప్పారు. పోలింగ్ రోజు, ఆ తరువాతి రోజున అందిన ఫిర్యాదులపై రిటర్నింగ్ అధికారులు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసుకుని త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు. పోలీసు శాఖకు సంబంధించి ఫిర్యాదులు ఎక్కువగా వచ్చాయన్నారు. వాటి పరిష్కారానికి జిల్లా పోలీసు కార్యాలయంలో ఒక బృందాన్ని ఏర్పాటు చేయాలని చెప్పారు. ప్రతి ఫిర్యాదుకూ రాతపూర్వకంగా వివరణ ఇవ్వాలని ఆదేశించారు.

షాడో పార్టీలను ఏర్పాటు చేయాలి

అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వారిపై నిఘా కోసం షాడో పార్టీలను ఏర్పాటు చేయాలని పోలీసు అధికారులను కలెక్టర్ ఆదేశించారు. ఎగ్జిట్ పోల్స్ విడుదలైన తరువాత, కౌంటింగ్ ప్రక్రియ తరువాత గొడవలు జరిగే అవకాశం ఉంటుందని, గత ఎన్నికల్లో బైండోవర్ చేసిన వారి జాబితాను ప్రస్తుత జాబితాతో పోల్చి ఎవరు లేరు అనేది గుర్తించాలన్నారు. అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వారు, సమస్యలు సృష్టించే వ్యక్తులపై ప్రత్యేక నిఘా ఉంచాలన్నారు. రాళ్లు, కర్రలు, ఇనుప కడ్డీలు, ఇతర వస్తువులు నిర్మాణ పనులకు కాకుండా అసాంఘిక కార్యకలాపాల కోసం ఉపయోగిస్తే కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సమావేశంలో జెడ్పీ సీఈఓ వైఖోమ్ నిధియాదేవి, నగర పాలక కమిషనర్ మేఘ స్వరూప్, డీఆర్ఓ రామకృష్ణారెడ్డి, ఏఎస్పీ విజయభాస్కర్‌రెడ్డి, రిటర్నింగ్ అధికారులు రాణి సుస్మిత, కరుణకుమారి, వి.శ్రీనివాసులురెడ్డి, వసంతబాబు, వెన్నెలశ్రీను, రాంభూపాల్‌రెడ్డి, జి.వెంకటేష్, తదితరులు పాల్గొన్నారు.

'ఉపాధి'పై దృష్టి పెట్టండి

ఉపాధి పథకం కింద కూలీలకు విరివిగా పనులు కల్పించడంపై ప్రత్యేక దృష్టి సారించాలని కలెక్టర్ వి.వినోద్‌కుమార్ సంబంధిత అధికారులను ఆదేశించారు. ఉపాధి పనుల కల్పనపై కలెక్టర్ మంగళవారం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాలు నుంచి ఉపాధి హామీ పథకం ఏపీఓలు, ఏపీడీలు, ఎంపీడీఓలతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధి పథకం కింద నిర్దేశించిన లక్ష్యాలను అధిగమించాలన్నారు. లేబర్ బడ్జెట్‌కు కేటాయించిన లక్ష్యంలో 79 శాతం పూర్తి చేశారన్నారు. కంబదూరు మండలం ముందంజలో ఉండగా, విడపనకల్లు మండలం చివరిస్థానంలో ఉందని, పురోగతి సాధించే దిశగా సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కేటాయించిన లక్ష్యాలకు అనుగుణంగా అన్ని మండలాల్లో పురోగతి చూపాలన్నారు. ఎస్సీ, ఎస్టీలకు ఉపాధి పనుల కల్పనపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని కలెక్టర్ వినోద్‌కుమార్ ఆదేశించారు.

జిల్లాలో 13.3 మి.మీ వర్షపాతం



అనంతపురంలోని సోమనాథ్‌నగర్‌లో విద్యుత్ పునరుద్ధరణ పనులు చేస్తున్న సిబ్బంది



అనంతపురం రూరల్ మండలం కురుగుంటలో నేలవాలిన అరటితోట

- రాప్తాడు మండలంలో అత్యధికం
- గాలీవానకు ఉద్యాన పంటలకు నష్టం

అనంతపురం అగ్రికల్చర్: జిల్లావ్యాప్తంగా 28 మండలాల పరిధిలో 13.3 మి.మీ సగటు వర్షపాతం నమోదైంది. రాప్తాడు మండలంలో అత్యధికంగా 45.2 మి.మీ వర్షం కురిసింది. ఆ తర్వాత అనంతపురం 37.2 మి.మీ, బుక్కరాయసముద్రం 34.2 మి.మీ, నార్పల 28.2 మి.మీ, కంబదూరు 20.2 మి.మీ, గార్లదిన్నె 20 మి.మీ, శింగనమల 18.8 మి.మీ, పామిడి 17.6 మి.మీ, కణేకల్లు 17.2 మి.మీ, గుత్తి 16.2 మి.మీ, ఆత్మకూరు 15.6 మి.మీ, గుమ్మఘట్ట 14.8 మి.మీ, యాడికి 13.4 మి.మీ, బొమ్మనహాళ్ 13.2 మి.మీ, శెట్టూరు 12.4 మి.మీ, వజ్రకరూరు 12.2 మి.మీ, కళ్యాణదుర్గం 10.6 మి.మీ, కూడేరు 10.2 మి.మీ వర్షం పడింది. మిగతా మండలాల్లో తేలికపాటి వర్షం కురిసింది.

ఉద్యాన పంటల నష్టం రూ.1.84 కోట్లు

గాలీవానతో కూడిన వర్షంతో జిల్లావ్యాప్తంగా పలు చోట్ల ఉద్యాన పంటలు దెబ్బతిన్నాయి. యల్లనూరు, యాడికి, కూడేరు, ఆత్మకూరు, బుక్కరాయసముద్రం, నార్పల, పుట్లూరు, కుందుర్పి,శెట్టూరు, ఉరవకొండ, అనంతపురం, బెళుగుప్ప మండలాల్లో ప్రధానంగా అరటి తోటలు నేలవాలగా, మామిడి, టమాట పంటలు కొంతమేర దెబ్బతిన్నాయి. 33 మంది రైతులకు చెందిన 59 హెక్టార్లలో ఉద్యాన పంటలు దెబ్బతినడంతో రూ.1.84 కోట్ల వరకు నష్టం జరిగినట్లు అధికారులు ప్రాథమికంగా అంచనా వేశారు.

వేగంగా మరమ్మతు పనులు

అనంతపురం టౌన్: విద్యుత్ స్తంభాల మరమ్మతు పనులు త్వరితగతిన చేపట్టినట్లు ఏపీఎస్పీడీసీఎల్ ఎస్ఈ సురేంద్ర తెలిపారు. ఈదురు గాలులకు జిల్లా వ్యాప్తంగా 60 విద్యుత్ స్తంభాలు పడిపోవడంతో సంస్థకు రూ.12.5 లక్షల మేర నష్టం వాటిల్లినట్లు వెల్లడించారు. సోమవారం రాత్రి ఒక్కసారిగా ఈదురు గాలులతో వర్షం కురవడంతో అనంతపురం రూరల్ మండలం ఏ.నారాయణపురం, సోమనాథ్‌నగర్, రాయల్ నగర్ తదితర ప్రాంతాల్లో 10కి పైగా స్తంభాలు నేలకూలాయి. మంగళవారం ఉదయమే విద్యుత్ సిబ్బంది మరమ్మతు పనులు వేగంగా చేపట్టి వినియోగదారులకు సకాలంలో విద్యుత్ అందేలా చూశారు. జిల్లా వ్యాప్తంగా 33 కేవీ విద్యుత్ స్తంభాలు..10, 11కేవీ స్తంభాలు..20, ఎల్‌టీ లైన్ స్తంభాలు.. 30తోపాటు 4 ట్రాన్స్‌ఫార్మర్లు దెబ్బతిన్నట్లు ఎస్ఈ వెల్లడించారు.

'తాగునీటికి ఇబ్బంది లేదు'

అనంతపురం అర్బన్: జిల్లాలో తాగునీటి సరఫరాలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకున్నామని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.ఎస్.జవహర్‌రెడ్డికి కలెక్టర్ వి.వినోద్‌కుమార్ తెలిపారు. తాగునీటి సరఫరా, శాంతిభద్రతలు, తదితర అంశాలపై సీఎస్ మంగళవారం రాష్ట్ర సచివాలయం నుంచి కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. కలెక్టరేట్ నుంచి కలెక్టర్‌తో పాటు నగర పాలక కమిషనర్ మేఘ స్వరూప్, అసిస్టెంట్ కలెక్టర్ బి.వినూత్న పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ తాగునీటి సరఫరాపై ఎప్పటికప్పుడు అధికారులతో సమీక్షిస్తున్నామన్నారు. నీటి సమస్య ఉన్న ఏడు గ్రామాల్లో ట్యాంకర్ల ద్వారా సరఫరా చేయిస్తున్నామని చెప్పారు. సీపీడబ్ల్యూ పథకాల కింద గ్రామాలకు నీటి సరఫరాను పునరుద్ధరిస్తున్నామన్నారు. అవసరమైన చోట అదనపు బోర్లు వేసేందుకు చర్యలు చేపట్టామన్నారు. తాగునీటి సరఫరాపై ఫిర్యాదుల స్వీకరణకు కమాండ్ కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశామన్నారు. ఫిర్యాదులను తక్షణం పరిష్కరించేలా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. సమావేశంలో మునిసిపల్ ఆర్‌డీ పీవీఎస్ఎన్ మూర్తి, ఏపీఎస్పీడీసీఎల్ ఎస్ఈ సురేంద్ర, సీపీఓ అశోక్‌కుమార్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

పెన్నోబిలేసుని బ్రహ్మోత్సవాలు ప్రారంభం

ఉరవకొండ: జిల్లాలో ప్రసిద్ధ పుణ్యక్షేత్రం పెన్నహోబిలం లక్ష్మీనృసింహస్వామి బ్రహ్మోత్సవాలు మంగళవారం అంగరంగ వైభవంగా ప్రారంభమయ్యాయి. వేదపండితులు శాస్త్రోక్తంగా అంకురార్పణ చేసి ఉత్సవాలకు శ్రీకారం చుట్టారు. ఆలయ ప్రధాన అర్చకులు ద్వారకానాథచార్యులు ఆధ్వర్యంలో గరుడపట ధ్వజారోహణ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ముందుగా మూలవిరాట్‌తో పాటు శ్రీదేవి, భూదేవి సమేత లక్ష్మీనృసింహస్వామికి అర్చకులు విశేష పూజలు, అభిషేకాలు చేశారు. గరుడపటాన్ని మేళతాళాలు, మంగళవాయిద్యాలు, వేద మంత్రోచ్ఛారణల మధ్య ఆలయ ధ్వజస్తంభంపై ఎగురవేశారు. మహా విష్ణువుకు అత్యంత ప్రీతిపాత్రుడైన గరుత్మంతుడి పటానికి ప్రత్యేక పూజలు చేసి స్వామి తిరు కల్యాణోత్సవాలకు సంకేతంగా అటు సకల దేవతలకు, ఇటు మానవజాతికి తెలిసేలా గరుడపట ధ్వజారోహణం గావించారు. కార్యక్రమంలో ఆలయ ఈఓ విజయ్‌కుమార్, అర్చకులు బాలాజీ, ఆలయ మాజీ చైర్మన్ రాకెట్ల అశోక్ పాల్గొన్నారు.





ప్రత్యేక అలంకరణలో లక్ష్మీనృసింహస్వామి మూలవిరాట్, ధ్వజారోహణ చేస్తున్న వేదపండితులు

రథం ట్రయల్ రన్ విజయవంతం

లక్ష్మీనృసింహస్వామి బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని రథం ట్రయల్ రన్ విజయవంతంగా సాగింది. గతేడాది మరమ్మతులు చేస్తున్న సమయంలో క్రేన్ పట్టు తప్పి రథంలోని కొంతభాగం కూలిపోయింది. ఈ క్రమంలో నూతన రథం నిర్మిస్తున్నారు. అయితే, బ్రహ్మోత్సవాలు రావడం, నూతన రథం తయారీ ఇంకా సాగుతుండడంతో పాత రథంతోనే ఉత్సవం నిర్వహించడం అనివార్యమైంది. ఆలయ ఈఓ విజయ్‌కుమార్ ప్రత్యేక చొరవ తీసుకుని పాత రథానికే మరమ్మతులు చేయించారు. ఈ క్రమంలోనే ముందు జాగ్రత్తగా ట్రయల్ రన్‌ను విజయవంతంగా నిర్వహించారు. అనంతరం ఆర్‌అండ్‌బీ సిబ్బంది సమక్షంలో రథాన్ని పొక్లెయిన్ సాయంతో తిరిగి యథాస్థానానికి చేర్చారు.

క్లుప్తంగా

యువకుడి బలవన్మరణం


మృతుడు చంద్ర

బ్రహ్మసముద్రం: మండలంలోని నంజాపురం గ్రామానికి చెందిన గొల్ల రామన్న కుమారుడు చంద్ర (29) సోమవారం రాత్రి ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన మేరకు... కొంతకాలంగా తాగుడుకు బానిసైన చంద్రతో మద్యం అలవాటు మాన్పించేందుకు తల్లిదండ్రులు చేయని ప్రయత్నమంటూ లేదు. అయినా చంద్రలో మార్పు రాలేదు. దీంతో కొడుకుతో మాట్లాడడం మానేశారు. ఇటీవల భార్య కూడా గొడవపడి పుట్టింటికి వెళ్లింది. దీంతో జీవితంపై విరక్తి పెంచుకున్న చంద్ర సోమవారం రాత్రి ఇంట్లో ఎవరూ లేని సమయంలో మద్యం మత్తులో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఘటనపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.

ద్విచక్ర వాహనాలు ఢీ - ఒకరి మృతి


ఆనంద్ (ఫైల్)

చెన్నేకొత్తపల్లి: ద్విచక్ర వాహనాలు పరస్పరం ఢీకొన్న ఘటనలో ఓ యువకుడు మృతి చెందాడు. మరో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. పోలీసులు తెలిపిన మేరకు... చెన్నేకొత్తపల్లికి చెందిన మోహన్‌రెడ్డి, తన బంధువు సాయినాథరెడ్డితో కలసి ద్విచక్ర వాహనంపై మంగళవారం ఉదయం రామగిరి మండలంలోని నసనకోట ముత్యాలమ్మ దేవాలయానికి బయలుదేరారు. రామగిరి మండల సరిహద్దులో నిర్మించిన ఆర్చ్ దాటగానే ఎదురుగా కనగానపల్లి మండలం తల్లిమడుగుల గ్రామానికి చెందిన కుమ్మర రంగ రత్నమ్మ, నాగరాజు దంపతుల ఏకైక కుమారుడు ఆనంద్ (23) ద్విచక్ర వాహనంపై ఎన్ఎస్ గేట్ వైపుగా దూసుకెళుతూ ఢీకొన్నాడు. ఘటనలో ముగ్గురూ తీవ్రంగా గాయపడ్డారు. క్షతగాత్రులను అటుగా వెళుతున్న వారు గుర్తించి వెంటనే 108 అంబులెన్స్ ద్వారా అనంతపురంలోని సర్వజనాస్పత్రికి తరలించారు. మార్గమధ్యంలో ఆనంద్ మృతి చెందాడు. మరో ఇద్దరి పరిస్థితి విషమంగా ఉండడంతో వైద్యుల సూచన మేరకు బెంగళూరుకు కుటుంబసభ్యులు తీసుకెళ్లారు. ఘటనపై చెన్నేకొత్తపల్లి పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు. కాగా, కేసు నమోదు విషయంగా రెండు మండలాల పోలీసుల మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. ప్రమాదం జరిగిన ప్రాంతం మీదంటే కాదు మీదని చెన్నేకొత్తపల్లి, రామగిరి మండలాల పోలీసులు వాదులాడారు. దాదాపు రెండు గంటల పాటు వివాదం కొనసాగింది. చివరకు వీఆర్వోలు, వీఆర్ఏలు అక్కడకు చేరుకుని సర్వేయర్‌ను పిలిపించి హద్దులు నిర్ణయించడంతో చెన్నేకొత్తపల్లి పోలీసులు కేసు నమోదు చేశారు.

పిడుగుల కాలం.. అప్రమత్తత అవసరం

- పిడుగుపాటుకు పశువులు, జీవాలతో పాటు మనుషులు బలి
- ఉరుములు, మెరుపుల సమయంలో జాగ్రత్తగా ఉండాలంటున్న శాస్త్రవేత్తలు



గత సోమవారం రాత్రి బత్తలపల్లి మండలం ఉప్పర్లపల్లి గ్రామ సమీపంలో పిడుగుపాటుకు దంపెట్ల గ్రామానికి చెందిన జింకా చంద్రశేఖర్ (55) మృతి చెందాడు. ఉప్పర్లపల్లి గ్రామ సమీపంలోని రైతు సుధీర్ పొలంలో కూలి పనులు చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకునేవాడు. సోమవారం రాత్రి పొలం వద్ద ఉన్నప్పుడే వర్షం మొదలైంది. దీంతో ఇంటి దారి పట్టాడు. ఇంతలో ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం అధికం కావడంతో సమీపంలోని కోళ్లఫాం వద్దకు వెళుతుండగా పిడుగు పడింది. దీంతో ఆందోళనకు గురైన చంద్రశేఖర్ కోళ్లఫాంలోని రైతుల వద్దకు చేరుకుని దాహంగా ఉందని నీళ్లు తాగుతూ కుప్పకూలి మృతి చెందాడు. ఆయన భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.


ఆకాశంలో పిడుగుపాటు దృశ్యం

అనంతపురం అగ్రికల్చర్: ఇటీవల వర్షాకాలం మొదలైతే చాలు పిడుగులు ప్రజలను భయాందోళనకు గురి చేస్తున్నాయి. ఏటా పిడుగు పాటుతో పశు, జీవ సంపదతో పాటు ఇతర మూగ జంతువులు, మనుషులూ ప్రాణాలు కోల్పోతున్నారు. గడ్డివాములు, పూరిగుడిసెలు, చెట్లు కాలిపోయి ఆస్తి నష్టం సంభవిస్తోంది. ఆకాశం మేఘావృతమై మిరుమిట్లు గొలిపే కాంతి (మెరుపు), పెద్ద శబ్దంతో గుడుగు (ఉరుము) వచ్చిందంటే చాలు పిడుగు పడటం గ్యారెంటీ అని ప్రజలు నిర్ధారిస్తున్నారు.

పిడుగుపాటు నష్టాలు మచ్చుకు కొన్ని

- 2023, మే 28న శింగనమల మండలం ఉల్లికల్లు గ్రామానికి చెందిన యువకులు వడ్డే బాలకృష్ణ, గౌరీశంకర్ పిడుగుపాటుతో మృతి చెందారు. ద్విచక్ర వాహనంపై వెళుతున్న సమయంలో వర్షం రావడం వల్ల మధ్యలో ఓ చెట్టు కిందకు చేరుకున్నారు. ఆ సమయంలో పిడుగు పాటుకు గురై అక్కడికక్కడే మృతిచెందారు.
- 2023, మే 31న గుమ్మఘట్ట మండలం దేవిరెడ్డిపల్లిలో పిడుగుపాటుకు గొల్ల పరమేష్‌కు చెందిన 10 గొర్రెలు మృత్యువాతపడ్డాయి. రూ.లక్షకు పైగా నష్టం వాటిల్లింది.
- 2023, జూన్ 1న యాడికి మండలం రాయలచెరువు గ్రామంలో పిడుగుపాటుకు రైతు దస్తగిరికి చెందిన పాడి ఆవు మృత్యువాత పడింది. రూ.50 వేలకు పైగా నష్టం జరిగింది.

పిడుగు అంటే

వాతావరణంలో ఉష్ణోగ్రతలు అధికంగా ఉన్నప్పుడు నీరు ఆవిరిగా మారి ఆకాశంలో దాదాపు 25 వేల అడుగుల ఎత్తు వరకు మేఘాలు ఏర్పడతాయి. అయితే పైనుంచి సూర్యరశ్మి అధికంగా తాకడం వల్ల తక్కువ బరువున్న ధనావేశిత మేఘాలు పైకి వెళ్తాయి. అధిక బరువుండే రుణావేశిత (ఎలక్ట్రాన్లు అధికంగా ఉన్నటువంటి) మేఘాలు కిందకు వస్తాయి. అంటే మనకు కనిపించే దట్టమైన మబ్బుల్లాంటి మేఘాల్లో ఎలక్ట్రాన్లు ఎక్కువగా ఉంటాయి. సైన్స్ ప్రకారం రుణావేశిత మేఘాల్లోని ఎలక్ట్రాన్లు ధనావేశిత మేఘాల వైపు ఆకర్షితమవుతుంటాయి. అయితే ధనావేశిత మేఘాలు చాలా ఎత్తుకు వెళ్లినపుడు దగ్గరలో ఏ వస్తువున్నా అటువైపు ఎలక్ట్రాన్లు ప్రయాణిస్తాయి. ఈ క్రమంలో మేఘాల నుంచి ఎలక్ట్రాన్లు ఒక్కసారిగా విడుదలై విద్యుత్ వలయంగా మారి భూమి మీదకు దూసుకువస్తాయి. వాటినే మనం పిడుగులుగా పిలుస్తాం. మరో రూపంలో ఆకాశంలో మేఘాలు పరస్పరం ఢీకొన్న సమయంలో వెలువడే కాంతిని మెరుపు. వచ్చే శబ్దాలను ఉరుములు, విడుదలయ్యే విద్యుత్‌ను పిడుగు అంటారు. ఒక్క పిడుగు ద్వారా కొన్ని కోట్ల వాట్ల విద్యుత్‌ను ఉత్పత్తి చేసే శక్తి ఉంటుందని శాస్త్రవేత్తలు చెబుతున్నారు. ఒక పిడుగులో దాదాపు 30 కోట్ల ఓల్టుల విద్యుత్ ఉంటుందని అంటున్నారు. అది ఎంత శక్తివంతమైనదంటూ పిడుగు మనిషిని నేరుగా తాకితే అక్కడికక్కడే బూడిదైపోవడం ఖాయం.

జాగ్రత్తలు తప్పనిసరి



పిడుగుపాటుకు గురికాకుండా ప్రజలు సరైన జాగ్రత్తలు తీసుకోవాలి. పొలాల్లో ఉన్న రైతులు, కూలీలు సాధ్యమైనంత తొందరగా సురక్షిత ప్రాంతాలకు చేరుకోవాలి. పిడుగు ప్రభావంతో లక్షల సెంటీగ్రేడ్లతో ఉత్పత్తి అయ్యే వేడి మనుషులపై పడితే తక్షణం గుండెపై ప్రభావం చూపుతుంది. ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురుస్తున్నప్పుడు చెట్ల కింద, ఎత్తైన ప్రదేశాల్లో ఉండకూడదు. ఎడ్లబండి, ద్విచక్ర వాహనం, ట్రాక్టర్ లాంటి వాహనాలు నడపకూడదు. నీళ్లలో ఈతకొట్టరాదు. ఎక్కువ నీరు ఉన్న ప్రాంతాల్లో ఉండకూడదు. ఫోన్‌లో మాట్లాడకూడదు. టీవీలు, ఇతర విద్యుత్ సాధనాలు కాలిపోయే ప్రమాదం ఉన్నందున విద్యుత్ వాహకాలను తొలగించాలి. విద్యుత్ తీగలు, కరెంటు స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్లకు అతి సమీపంలో ఉండకూడదు. చెప్పులు లేకుండా బయటకు వెళ్లకూడదు. అటవీ ప్రాంతాల్లో ఉండకూడదు.

– డాక్టర్ బి.సహదేవరెడ్డి, శాస్త్రవేత్త, రేకులకుంట వ్యవసాయ పరిశోధన స్థానం

మైదాన ప్రాంతాల్లో ఎక్కువ



పిడుగుపాటు మరణాలు సాధారణంగా మైదాన ప్రాంతాల్లో ఎక్కువగా ఉంటాయి. మైదాన ప్రాంతాల్లో ఉన్న సమయంలో మెరుపులు కనిపించిన వెంటనే నేలపై మోకాళ్లమీద కూర్చొని తల కిందకు వంచి ఉండాలి. ఎత్తైన చెట్లు, శిథిల భవనాల కింద ఉండకూడదు. వ్యవసాయ పనుల్లో ఉన్న వారు అందరూ ఒకే చోట గుంపుగా ఉండకూడదు.నేలపై బోర్లా పడుకోకుండా తలవంచి మోకాళ్ల మీద కూర్చోవడం ఉత్తమం. గొడుగులు వాడకూడదు, చేతిలో పలుగు, పార లాంటి ఇనుప వస్తువులు ఏవీ ఉండకూడదు. సెల్‌ఫోన్‌లో మాట్లాడటం, కెమెరా ద్వారా ఫొటోలు తీయడం మంచిది కాదు. ఉరుముల సమయంలో పాత్రలు కడగడం, స్నానం చేయడం మంచిదికాదు. ఇళ్లపై పిడుగు పడడం చాలా అరుదుగా ఉంటుంది. పిడుగు బారి నుంచి తప్పించుకునేందుకు నివాస గృహాలే మేలు.

– డాక్టర్ జి.నారాయణస్వామి, శాస్త్రవేత్త, రేకులకుంట వ్యవసాయ పరిశోధన స్థానం

ముమ్మరంగా కార్డెన్ సెర్చ్


ఇటుకలపల్లి పోలీస్‌స్టేషన్‌ను తనిఖీ చేస్తున్న ఎస్పీ గౌతమి శాలి

అనంతపురం: ఎస్పీ గౌతమి శాలి ఆదేశాలతో జిల్లా వ్యాప్తంగా మంగళవారం కార్డెన్ సెర్చ్ ఆపరేషన్లు ముమ్మరం చేశారు. పాత నేరస్తులు, ట్రబుల్ మాంగర్స్, రౌడీషీటర్లు, అక్రమ మద్యం, నాటుసారా, పాత కేసుల్లోని నిందితుల ఇళ్లలో సీఐలు, ఎస్ఐల ఆధ్వర్యంలో సిబ్బంది విస్తృత తనిఖీలు చేపట్టింది. ఆయా గ్రామాల్లో ఫుట్‌పెట్రోలింగ్ నిర్వహించారు. గ్రామ సభలు నిర్వహించి ఎన్నికల కౌంటింగ్ ప్రక్రియ అనంతరం ప్రశాంతంగా జీవించాలని సూచనలు చేశారు. ఎలాంటి అల్లర్లకు వెళ్లకూడదన్నారు. సమస్యలు సృష్టించినా, ప్రేరేపించినా కారకులపై కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు.

- అనంతపురం నగరంలో కేంద్ర సాయుధ బలగాలతో డీఎస్పీ టీవీవీ ప్రతాప్ ఫ్లాగ్‌మార్చ్ చేపట్టారు. గొడవలకు దూరంగా ఉంటూ ప్రశాంతంగా జీవించాలని నగర వాసులకు సూచించారు. జిల్లా కేంద్రంలోని క్లాక్ టవర్ నుంచి సుభాష్ రోడ్డు, సప్తగిరి సర్కిల్, సూర్యనగర్, బసవన్న కట్ట, గాంధీ బజార్, తాడిపత్రి బస్టాండ్, తిలక్ రోడ్డు, శ్రీకంఠం సర్కిల్, ఎన్టీఆర్ సర్కిల్ మీదుగా ఆర్ట్స్ కళాశాల వరకూ ఫ్లాగ్ మార్చ్ కొనసాగింది. అనంతపురం డీఎస్పీతో పాటు నగర సీఐలు వి.రెడ్డప్ప, ఆర్.ప్రతాప్‌రెడ్డి, నారాయణరెడ్డి, ర్యాపిడ్ యాక్షన్ ఫోర్స్ బలగాలు పాల్గొన్నాయి.
- సమస్యాత్మక గ్రామాల్లో పటిష్ట భద్రతా చర్యలు చేపట్టాలని రాప్తాడు, ఇటుకలపల్లి పోలీస్ స్టేషన్ అధికారులను ఎస్పీ గౌతమి శాలి ఆదేశించారు. మంగళవారం ఉదయం ఆయా స్టేషన్లను ఆమె ఆకస్మిక తనిఖీ చేశారు. సమస్యాత్మక గ్రామాలు, అక్కడి తాజా పరిస్థితులపై ఆరా తీశారు. ట్రబుల్ మాంగర్స్‌ను గుర్తించి వెంటనే బైండోవర్ చేయాలన్నారు. ఫుట్ పెట్రోలింగ్, గ్రామసభలు, కార్డెన్ సెర్చ్ ఆపరేషన్లపై దృష్టి సారించాలన్నారు. ఎన్నికల కౌంటింగ్ తర్వాత గ్రామాల్లో హింసకు తావు లేకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఇటుకలపల్లి సీఐ మునిస్వామి, నరేంద్ర రెడ్డి పాల్గొన్నారు.

తల్లిదండ్రుల చెంతకు బాలికలు


బాలికలకు కౌన్సెలింగ్ ఇస్తున్న ఐసీడీఎస్ పీడీ శ్రీదేవి, పీఓ వెంకటేశ్వరి

అనంతపురం సిటీ: బెంగళూరు సిటీ చూడాలన్న ఆకాంక్షతో ఇంటి నుంచి పారిపోయి వచ్చిన ముంబయికి చెందిన ఇద్దరు బాలికలను రైల్వే పోలీసులు కాపాడి సురక్షితంగా తల్లిదండ్రుల వద్దకు చేర్చారు. వివరాలు... ముంబయిలోని కుంచికుట్టేరి ప్రాంతానికి చెందిన 14, 15 ఏళ్ల వయసున్న ఇద్దరు బాలికలు ఈ నెల 18న ఇంట్లో చెప్పకుండా ఉద్యాన్ ఎక్స్‌ప్రెస్ రైలు ఎక్కారు. తమ పిల్లలు కనిపించకపోవడంతో ఆందోళనకు గురైన వారి తల్లిదండ్రులు ముంబయి పోలీసులకు ఫిర్యాదు చేశారు. విషయాన్ని వెంటనే దేశవ్యాప్తంగా ఉన్న అన్ని రైల్వే, పోలీస్ స్టేషన్లకు ముంబయి పోలీసులు చేరవేశారు. ఈ క్రమంలో రైలు గుంతకల్లుకు చేరుకోగానే రైల్వే ప్రొటెక్షన్ ఫోర్స్(ఆర్‌పీఎఫ్) పోలీసులు బోగీలను గాలించారు. ఆ సమయంలో అనుమానాస్పదంగా కనిపించిన ఇద్దరు బాలికలను అదుపులోకి తీసుకుని స్టేషన్‌కు తరలించి వివరాలు ఆరా తీశారు. బెంగళూరు చూడాలన్న కోరిక ఎప్పటి నుంచో ఉందని, అయితే తమ కుటుంబాల ఆర్థిక పరిస్థితి సరిగా లేకపోవడంతో చెప్పాపెట్టకుండా రైలెక్కి వచ్చేసినట్లు బాలికలు వివరించారు. ఆర్‌పీఎఫ్ నుంచి సమాచారం అందుకున్న ఐసీడీఎస్ పీడీ శ్రీదేవి ఆదేశాల మేరకు బాలల సంక్షేమ సమితి డీసీపీఓ మంజునాథ, పీఓ(ఐసీ) వెంకటేశ్వరి గుంతకల్లుకు వెళ్లి బాలికలను అనంతపురానికి తీసుకువచ్చారు. ఇద్దరినీ సీడబ్ల్యూసీ చైర్‌పర్సన్ మేడా రామలక్ష్మి ఎదుట హాజరుపరిచి, కౌన్సెలింగ్ అనంతరం కుటుంబసభ్యులకు సమాచారం అందించి, వారొచ్చే వరకూ బుద్ధప్పనగర్‌లోని చిల్డ్రన్ హోంలో ఆశ్రయం కల్పించారు. మూడు రోజుల అనంతరం మంగళవారం అనంతపురానికి చేరుకున్న తల్లిదండ్రులకు బాలికలను సురక్షితంగా అప్పగించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ పీడీ శ్రీదేవి, డీసీపీఓ మంజునాథ, పీఓ వెంకటేశ్వరి, ఐసీపీఎస్ సోషల్ వర్కర్ వసంత పాల్గొన్నారు.

ఏపీఎల్ విజేత 'రైజింగ్ స్టార్స్'


విజేత ట్రోఫీ అందుకుంటున్న అనంత రైజింగ్ స్టార్స్ జట్టు

అనంతపురం: అనంతపూర్ క్రికెట్ లీగ్ (ఏపీఎల్) – 2 విజేత ట్రోఫీని అనంత రైజింగ్ స్టార్ గెలుచుకుంది. అనంత క్రీడాగ్రామంలోని ప్రధాన మైదానంలో మంగళవారం జరిగిన ఫైనల్ మ్యాచ్‌లో ఇండియన్ సిక్సర్స్, అనంత రైజింగ్ స్టార్స్ తలపడ్డాయి. టాస్ గెలిచి తొలుత బ్యాటింగ్ ఎంచుకున్న రైజింగ్ స్టార్స్ జట్టు నిర్ణీత 20 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 132 పరుగులు చేసింది. జట్టు బ్యాటర్ బి.ప్రశాంత్ 56 బంతుల్లో 5 ఫోర్లు, 2 సిక్సర్లు 58 పరుగులు చేశారు. ఇండియన్ సిక్సర్స్ బౌలర్లు హరిశంకర్‌రెడ్డి, ఎం.ఖాన్, వి.సంజయ్ నాయుడు చెరో రెండు వికెట్లు చొప్పున తీశారు. తర్వాత బ్యాటింగ్ చేసిన ఇండియన్ సిక్సర్స్ జట్టు నిర్ణీత 20 ఓవర్లలో 113 పరుగులకే కుప్పకూలింది. కోగటం హనీష్ వీరారెడ్డి 35 పరుగులు, ప్రవీణ్‌కుమార్ రెడ్డి 22 పరుగులతో రాణించారు. రైజింగ్ స్టార్స్ బౌలర్లు ఎం.దీపక్ , షాహిద్ చెరో రెండు వికెట్లు తీశారు. 19 పరుగులతో అనంత రైజింగ్ స్టార్స్ గెలిచి టైటిల్‌ను సొంతం చేసుకుంది. విజేత జట్టును అభినందిస్తూ ట్రోఫీని ఆర్డీటీ చైర్మన్ ఎం.తిప్పేస్వామి అందజేశారు. మ్యాన్ ఆఫ్‌ది మ్యాచ్ అవార్డును బి.ప్రశాంత్‌కు భారత మహిళా మాజీ క్రికెటర్ సునేత్ర పరాన్జపే అందజేశారు. కార్యక్రమంలో ఐపీఎల్ మాజీ క్రీడాకారుడు పైడికల్వ విజయ్‌కుమార్ (డెక్కన్ ఛార్జర్స్), కె.మధు ఆచారి, బీఆర్ ప్రసన్న, షబ్బీర్ అహమ్మద్, భీమలింగారెడ్డి, రాష్ట్ర యాదవ కార్పొరేషన్ చైర్మన్ హరీష్‌కుమార్ యాదవ్, నగర డిప్యూటీ మేయర్ కోగటం విజయభాస్కరరెడ్డి, డాక్టర్ సుప్రియా చౌదరి, కోచ్‌లు పాల్గొన్నారు.

ఒక్క రోజే 381 మంది బైండోవర్

అనంతపురం: శాంతి భద్రతల పరిరక్షణలో జిల్లా వ్యాప్తంగా పోలీసులు కఠినంగా వ్యవహరిస్తున్నారు. ఈ క్రమంలో సమస్యలు సృష్టించే అవకాశం ఉన్న 381 మందిని మంగళవారం బైండోవర్ చేయించారు. ఎన్నికల ప్రక్రియ ప్రారంభం అయినప్పటి నుంచి ఇప్పటి వరకూ జిల్లాలో 6,289 మందిని బైండోవర్ చేసినట్లు ఎస్పీ గౌతమి శాలి తెలిపారు. కౌంటింగ్ ప్రక్రియ, ఆ తర్వాత కూడా హింసాత్మక ఘటనలకు తావివ్వకుండా చర్యలు ముమ్మరం చేస్తున్నట్లు వివరించారు.

వలంటీర్ హత్యకేసులో నిందితుల అరెస్ట్

గోరంట్ల: మండలంలోని కొత్తబోయినపల్లి సమీపంలో ఆదివారం సాయంత్రం మల్లాపల్లి గ్రామ మాజీ వలంటీర్ అనిల్‌కుమార్ యాదవ్ హత్య కేసులో నిందితులను పోలీసులు అరెస్ట్ చేశారు. వివరాలను మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో గోరంట్ల సీఐ సుబ్బరాయుడుతో కలసి పెనుకొండ డీఎస్పీ షేక్ బాజీజాన్‌సైదా వెల్లడించారు. మల్లాపల్లికి చెందిన అనిల్‌కుమార్... మరో ఇద్దరు స్నేహితులతో కలసి కర్ణాటకలోని బాగేపల్లి తాలూకా పెసలపర్తి గ్రామానికి ఆదివారం సాయంత్రం మద్యం సేవించేందుకు వెళ్లాడు. అదే క్రమంలో కొత్తచెరువుకు చెందిన సైఫుల్లా తన ఐదుగురు స్నేహితులతో కలసి కారులో పెసలపర్తికి చేరుకున్నాడు. ఇరు వర్గాలు మద్యం కొనుగోలు చేసి, సమీపంలోని వ్యవసాయ పొలాల్లో పక్కపక్కనే కూర్చొని సేవించారు. ఆ సమమయంలో సైఫుల్లా స్నేహితులు మద్యం మత్తులో గట్టిగా కేకలు వేయడంతో అనిల్‌కుమార్, అతని స్నేహితులు వారించారు. ఆ సమయంలో కోపగించుకున్న సైఫుల్లా, మిత్ర బృందం వాగ్వాదానికి దిగి అనిల్‌కుమార్, అతని స్నేహితులను బెదిరించారు. అనంతరం స్నేహితులతో కలసి స్వగ్రామానికి ద్విచక్ర వాహనాల్లో అనిల్‌కుమార్ బయలుదేరాడు. కొత్తబోయినపల్లి సమీపంలోకి చేరుకోగానే వెనుకనే కారులో వచ్చిన సైఫుల్లా, అతని స్నేహితులు ద్విచక్ర వాహనంపై వెళుతున్న అనిల్‌కుమార్‌ను అడ్డుకుని దాడి చేశారు. ఘటనలో అనిల్‌కుమార్ అక్కడికక్కడే మృతి చెందాడు. హతుడి తండ్రి నరసింహప్ప ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు వేగవంతం చేశారు. ఈ క్రమంలో మంగళవారం ఉదయం నిందితులు దూదేకుల సైఫుల్లా, ముష్టూరి కుమార్, గొల్ల రఘునాథ్‌యాదవ్, గణేష్‌కుమార్, చింతకాయల హేమంత్‌కుమార్, గొల్ల సాయినాథ్ యాదవ్ కొత్తచెరువు వీఆర్వో ఓబులేసు ఆధ్వర్యంలో పోలీసుల వద్ద లొంగిపోయారు. కాగా, నిందితులను న్యాయస్థానంలో హాజరుపరిచే క్రమంలో వైద్య పరీక్షలకు గోరంట్లలోని ప్రభుత్వాస్పత్రికి పోలీసులు తీసుకెళ్లారు. వైద్య పరీక్షలు నిర్వహించిన అనంతరం ఫిట్ నెస్ సర్టిఫికెట్ ఇచ్చేందుకు వైద్యాధికారి పావని నిరాకరించారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు తాను ఫిట్‌నెస్ సర్టిఫికెట్ ఇవ్వలేనంటూ రాతపూర్వకంగా ఆమె పోలీసులకు ఇచ్చారు.

'తపాలా'లో బదిలీలు

అనంతపురం సిటీ: తపాలా శాఖలో 29 మంది పోస్టల్ అసిస్టెంట్లను బదిలీ చేస్తూ ఆ శాఖ డివిజనల్ సూపరింటెండెంట్ గుంపస్వామి మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. బదిలీ అయిన వారు జూన్ 30లోపు తమకు కేటాయించిన స్థానాల్లో చేరిపోవాలని ఆదేశించారు. అనంతపురంలోని హెడ్ ఆఫీస్‌లో పనిచేస్తున్న పీఎస్ఆర్‌కే ప్రసాద్‌ను పాతూరు పోస్టాఫీసుకు బదిలీ చేశారు. అలాగే కె.రాఘవేంద్ర ప్రసాద్ (జార్జిపేట), కె.షాషావలి (ఎస్పీ ఆఫీస్), ఎ.శిల్ప (జార్జి పేట), సి.హనీఫా (కలెక్టరేట్), కె.రాజాకుమార్ (గుంతకల్లు హెచ్‌ఓ)కు బదిలీ అయ్యారు. పాతూరు పోస్టాఫీస్‌లో పనిచేస్తున్న కె.నాగేనాయక్‌ను హెడ్‌ఆఫీసుకు, గుంతకల్లు హెడ్ ఆఫీస్‌లో పనిచేస్తున్న బి.ప్రసన్నలక్ష్మి (గుత్తి), డి.కిరణ్‌కుమార్ (అనంతపురం హెచ్‌ఓ), ఎం.రవికృపాకర్‌రావు (గుత్తి), కె.అనూరాధ లక్ష్మీతులసి (జార్జిపేట, అనంతపురం), కె.రమాదేవి (తిమ్మనచెర్ల), వి.కృష్ణానాయక్ (రాయదుర్గం), ఎం.ఆంజినేయులు (తిమ్మనచెర్ల), మనోజ్ దలాల్ (అనంతపురం హెచ్‌ఓ), తిమ్మనచెర్లలో పనిచేస్తున్న సీఏ చంద్రకళ, ఎ.అమరనాథ్ గుంతకల్లు హెచ్‌ఓకు బదిలీ అయ్యారు. అనంతపురంలోని జార్జిపేట పోస్టాఫీసులో పనిచేస్తున్న మహమ్మద్ గౌసియాబేగం, కె.శర్వాణి, పి.నాగలక్ష్మీదేవి, యు.సుధాకరరెడ్డి, పాతూరు పోస్టాఫీసులో పనిచేస్తున్న జి.అశ్వత్థనారాయణను హెడ్‌ఆఫీస్‌కు బదిలీ చేశారు. ఎస్పీ కార్యాలయంలో పనిచేస్తున్న వి.మంజుల... జార్జిపేట పోస్టాఫీస్‌కు బదిలీ అయ్యారు. రాయదుర్గం నుంచి పి.మురళీమోహన్... కణేకల్లుకు, పి.రాజశేఖర్ గుంతకల్లు హెచ్‌ఓకు, ఉరవకొండ నుంచి గుంతకల్లు హెచ్‌ఓకు కె.చాంద్‌బాషా, కణేకల్లు నుంచి అనంతపురం పాతూరు పోస్టాఫీస్‌కు జి.కేశవయ్య, గుత్తి నుంచి గుంతకల్లు హెచ్‌ఓకు సి.వెంకటేష్, టి.నాగరాజు బదిలీ అయ్యారు.

24న విత్తన మేళాకు తరలిరండి

ధర్మవరం రూరల్: రైతులకు నాణ్యమైన విత్తనాలను అందించాలనే ఉద్దేశంతో ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన కేంద్రం- పాలెం వారి ఆధ్వర్యంలో ఈ నెల 24న విత్తన మేళా కార్యక్రమం నిర్వహించనున్నట్లు ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానం సహ పరిశోధన సంచాలకులు యం.మల్లారెడ్డి మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమంలో వివిధ రకాల పంటలకు సంబంధించిన నాణ్యమైన విత్తన రకాలను విక్రయానికి అందుబాటులో ఉంచడంతో పాటు పంటల సమగ్ర సమాచారం గురించి శాస్త్రవేత్తలు అవగాహన కల్పిస్తారని పేర్కొన్నారు. ఈ నెల 24న ఉదయం 10 గంటలకు ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం పాలెంకు తరలిరావాలని రైతులను కోరారు. మరింత సమాచారం కోసం 9490409163 నంబరులో సంప్రదించాలని సూచించారు.

ప్రమాదంలో యువకుడి మృతి - మరొకరికి తీవ్రగాయాలు

రాప్తాడు రూరల్: అనంతపురం రూరల్ మండలం కురుగుంట వద్ద మంగళవారం రాత్రి చోటు చేసుకున్న ప్రమాదంలో ఓ యువకుడు మృతి చెందాడు. మరో యువకుడు తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు తెలిపిన మేరకు... కామారుపల్లికి చెందిన వంశీ (19), ప్రశాంత్ ఇద్దరూ బేల్దారి పనితో జీవనం సాగిస్తున్నారు. ఇద్దరూ ఆ వివాహితులే. మంగళవారం రాత్రి 8 గంటలకు అనంతపురంలో చికెన్ కొనుగోలు చేసి స్వగ్రామానికి ద్విచక్ర వాహనంపై వెళుతుండగా కురుగుంట కోళ్లఫారం సమీపంలోకి చేరుకోగానే ఎదురుగా వచ్చిన టిప్పర్ ఢీకొంది. ఘటనలో టిప్పర్ దూసుకెళ్లడంతో వంశీ రెండు కాళ్లూ నుజ్జునుజ్జయ్యాయి. ఇద్దరినీ వెంటనే ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించి వంశీ మృతి చెందాడు. కాగా, ప్రమాదానికి కారణమైన డ్రైవర్ వాహనాన్ని ఆపకుండా ముందుకు దూసుకెళ్లి మల్లయ్య కొట్టాల సమీపంలో మరో ద్విచక్ర వాహనాన్ని ఢీకొన్నట్లుగా సమాచారం. ఈ ఘటనలో ద్విచక్ర వాహనంపై వెళుతున్న వారు స్వల్ప గాయాలతో బయటపడ్డారు. వాహనంతో సహా టిప్పర్ డ్రైవర్ ఉడాయించాడు. సమాచారం అందుకున్న సీఐ రామకృష్ణారెడ్డి ఘటనాస్థలానికి చేరుకుని పరిశీలించి, కేసు నమోదు చేశారు.

బీటెక్ విద్యార్థి ఆత్మహత్య


మృతుడు గౌతమ్

పుట్టపర్తి టౌన్: పరీక్షల్లో ఉత్తీర్ణత కాలేకపోతున్నాననే బాధతో ఓ బీటెక్ విద్యార్థి ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన మేరకు... పుట్టపర్తి మున్సిపాలిటీ పరిధిలోని ఎనుములపల్లి గణేష్ సర్కిల్‌లో నివాసముంటున్న ఆనంద్, ఉష దంపతులకు ఓ కుమారుడు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. కుమారుడు గౌతమ్ (23) అనంతపురం శివారులోని అనంతలక్ష్మి ఇంజినీరింగ్ కళాశాలలో బీటెక్ ఫైనల్ ఇయర్ చదువుతున్నాడు. ఇటీవల నిర్వహించిన పరీక్షల్లో ఏడు సబ్జెక్టుల్లో ఫెయిల్ కావడంతో తీవ్ర మనస్తాపానికి గురయ్యాడు. మంగళవారం ఉదయం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఇంట్లోనే ఫ్యాన్‌కు చున్నీతో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ విషయాన్ని తల్లిదండ్రులు గుర్తించేలోపు విగతజీవిగా మారాడు. సమాచారం అందుకున్న పోలీసులు అక్కడకు చేరుకుని పరిశీలించారు. ఘటనపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు సీఐ కొండారెడ్డి తెలిపారు.

డీఎస్పీ బాధ్యతల స్వీకరణ


జనార్దన్‌నాయుడు

తాడిపత్రి అర్బన్: తాడిపత్రి పోలీస్ సబ్‌డివిజనల్ అధికారిగా కె.జనార్దన్‌నాయుడు మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఆయనకు సీఐలు, డీఎస్పీ కార్యాలయ సిబ్బంది ఘన స్వాగతం పలికారు. అనంతరం తాడిపత్రి అర్బన్ పోలీస్ స్టేషన్‌లో ఉన్న డీఐజీ షిమోషిని మర్యాదపూర్వకంగా కలిశారు. శాంతి భద్రతల విషయంలో రాజీ పడకుండా కఠినంగా వ్యవహరించాలని ఆయనకు డీఐజీ సూచించారు. తాడిపత్రిలో ప్రశాంత జీవనానికి భంగం కలిగించేవారు ఎంతటి స్థాయిలో ఉన్నా ఉపేక్షించొద్దన్నారు.

గుత్తి ఆర్‌డబ్ల్యూఎస్ డీఈఈ రాజ్‌కుమార్ హఠాన్మరణం


రాజ్‌కుమార్ (ఫైల్)

గుత్తి రూరల్: ఆర్‌డబ్ల్యూఎస్ డీఈఈ, గుత్తి మండల ఎన్నికల నోడల్ అధికారి జీవీ రాజ్‌కుమార్(53) మంగళవారం హఠాన్మరణం చెందారు. రెండు రోజులుగా అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న ఆయన మంగళవారం ఉదయం ఛాతీలో నొప్పిగా ఉందని చెప్పారు. దీంతో కుటుంబసభ్యులు అనంతపురంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తీసుకెళ్లారు. చికిత్స సమయంలోనే పరిస్థితి విషమించి ఆయన మృతిచెందారు. ఆయనకు భార్య, ఓ కుమారుడు, కుమార్తె ఉన్నారు. కాగా, రాజ్‌కుమార్ స్వస్థలం వైఎస్సార్ జిల్లా కడప. ఉద్యోగ రీత్యా అనంతపురంలో ఆయన స్థిరపడ్డారు. రాజ్‌కుమార్ మరణవార్త తెలుసుకున్న ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ ఎహసాన్‌బాషా, ఈఈ జవహర్‌కుమార్, జిల్లాలోని డీఈఈ, ఏఈఈ, జేటీఓ, ఇతర ఆర్‌డబ్ల్యూఎస్ సిబ్బంది అనంతపురంలోని డీఈఈ నివాసానికి చేరుకుని మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. బాధిత కుటుంబసభ్యులను పరామర్శించారు.

క్లుప్తంగా

సకాలంలో చేరిన పాఠ్య పుస్తకాలు



పాఠ్య పుస్తకాలు చూపుతున్న ఎంఈఓ రామాంజనేయులు

ఆత్మకూరు: నూతన విద్యా సంవత్సరానికి సంబంధించిన పాఠ్య పుస్తకాలు మంగళవారం ఆత్మకూరుకు చేరాయి. నార్త్ పాఠశాలలో పుస్తకాలు ఉంచారు. మడల వ్యాప్తంగా 1 నుంచి 7వ తరగతి వరకు పాఠ్యపుస్తకాలు 6 వేల పుస్తకాలు వచ్చినట్లు ఎంఈఓ–2 రామాంజనేయులు తెలియజేశారు. ఇందులో భాగంగా ఎమ్మార్సీ సిబ్బంది తరగతుల వారీగా పుస్తకాలను వేరు చేశారు. పాఠశాలలు పునఃప్రారంభం కాకనే పుస్తకాలు మండలానికి చేరాయని ఉపాధ్యాయులు తెలియజేశారు.

ఆర్డీటీ ఆధ్వర్యంలో అంగన్‌వాడీ భవన నిర్మాణం



అంగన్‌వాడీ కేంద్రాన్ని పరిశీలిస్తున్న అధికారులు, దాతలు

ఆత్మకూరు: పంపనూరులో ఉన్న పాత అంగన్‌వాడీ కేంద్రం స్థానంలో ఆర్డీటీ ఆధ్వర్యంలో కొత్త అంగన్‌వాడీ కేంద్రం నిర్మాణం త్వరలో చేపట్టనున్నట్లు ఐసీడీఎస్ సూపర్‌వైజర్ లావణ్య తెలిపారు ఆర్డీటీ తరఫున ఆస్ట్రేలియాకు చెందిన దాతలు మంగళవారం పాత భవనాన్ని పరిశీలించారు. దాదాపు రూ.13 లక్షలకు పైగా వ్యయంతో భవనం నిర్మించనున్నట్లు వారు వెల్లడించారు.

పోషక ఆహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం

- ఐసీడీఎస్ పీడీ బీఎన్ శ్రీదేవి

అనంతపురం రూరల్: గర్భిణులు, బాలింతలు పోషక విలువతో కూడిన ఆహారాన్ని తీసుకుంటే సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటారని ఐసీడీఎస్ పీడీ బీఎన్ శ్రీదేవి తెలిపారు. మంగళవారం రుద్రంపేట పంచాయతీ చంద్రబాబునగర్ కాలనీ అంగన్‌వాడీ కేంద్రం–1లో మాసిక మహోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పీడీ మాట్లాడుతూ, గర్భిణులు, బాలింతలు పండ్లు, కూరగాయలతో పాటు పోషక విలువలతో కూడిన ఆహారాన్ని తీసుకుంటే తల్లీబిడ్డా ఆరోగ్యంగా ఉంటారన్నారు. నెలసరి సమయంలో మహిళలు, యుక్త వయసు అమ్మాయిలు బలవర్ధకమైన ఆహారాన్ని తీసుకోవాలని, అలాగే వ్యక్తిగత పరిశుభ్రతను పాటించాలన్నారు. కార్యక్రమంలో సీడీపీఓ ధనలక్ష్మి, సూపర్‌వైజర్ ఝాన్సీ, అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

రేపు 'వరదహస్తం' పుస్తకావిష్కరణ సభ

అనంతపురం కల్చరల్: గండ్లూరి పంకజమ్మ రచించిన 'వరదహస్తం' పుస్తకావిష్కరణ సభ ఈ నెల 23న ఉదయం 10 గంటలకు స్థానిక ఉపాధ్యాయ భవన్‌లో నిర్వహిస్తున్నారు. 'స్పందన' అనంత కవుల వేదిక, తెలుగు వెలుగు సాహిత్య సామాజిక సేవా సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో సాహిత్య కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు చం.శాస్త్రి ఓ ప్రకటనలో తెలిపారు. ప్రముఖ రచయితలు, కవులు పుస్తక సమీక్ష చేస్తారని, సాహితీ అభిమానులందరూ విచ్చేయాలని కోరారు.

ప్రజలంతా సంయమనంతో ఉండాలి



గ్రామసభ నిర్వహిస్తున్న దృశ్యం

అనంతపురం: ప్రజలంతా ప్రశాంత జీవనం గడపాలని, చట్ట వ్యతిరేకంగా ఎవరు వ్యవహరించినా.. కఠిన చర్యలు తప్పవని ఇటుకలపల్లి సీఐ నరేంద్ర రెడ్డి అన్నారు. ఎలాంటి పరిస్థితులు ఎదురైనా ప్రతిఒక్కరూ సంయమనం పాటించాలన్నారు. మంగళవారం ఆయన అనంతపురం రూరల్ మండలం పరిధిలోని చియ్యేడు, పూలకుంట, ఇటుకలపల్లి గ్రామాల్లో కేంద్ర బలగాలు, సివిల్ పోలీసులతో కవాతు నిర్వహించారు. అనంతరం గ్రామ సభలు నిర్వహించారు.
అనంతపురం రూరల్ మండలంలో అమలు అవుతున్న 144 సెక్షన్ గురించి ప్రజలకు వివరించారు. ఐదుగురు కంటే ఎక్కువ గుమికూడి ఉండకూడదన్నారు. ప్రస్తుతం గ్రామాల్లో ప్రశాంత పరిస్థితులు ఉన్నాయని, ఇదే ప్రశాంతతను కొనసాగించేందుకు ప్రజలంతా సహకరించాలన్నారు. కార్యక్రమంలో ఇటుకలపల్లి ఎస్ఐ రాఘవేంద్ర రెడ్డి పాల్గొన్నారు.



ఈమె పేరు పద్మావతి. పాతూరుకు చెందిన ఈమె కిడ్నీ సమస్యతో చాలా రోజులుగా బాధ పడుతోంది. ప్రస్తుతం స్థానిక సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిలోని డయాలసిస్ యూనిట్‌లో డయాలసిస్ చేయించుకుంటోంది. గతంలో ప్రైవేట్ ఆస్పత్రుల్లో రూ.వేలల్లో డబ్బు ఖర్చు అయ్యేదని, సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిలో పైసా ఖర్చు లేకుండా ఉచితంగా డయాలసిస్, ఇతర సేవలు అందుతున్నాయని పద్మావతి చెబుతోంది.



ఈ ఫోటోలో కన్పిస్తున్న వృద్ధుని పేరు హమీస్. సొంతూరు ధర్మవరం. ఈ నెల 16న ఛాతీ నొప్పి రావడంతో ప్రభుత్వ సర్వజనాస్పత్రికి రాగా, గుండె సంబంధిత సమస్య ఉందని వైద్యులు గుర్తించారు. అదే రోజున సూపర్‌స్పెషాలిటీలో యాంజియోగ్రామ్, ఈ నెల 18న స్టంట్ వేశారు. ప్రైవేటుగా ఇటువంటి సేవలు పొందాలంటే రూ.2 లక్షలు ఖర్చు అవుతుందని, తమ లాంటి పేదోళ్లకు ప్రభుత్వం చేస్తున్న మేలును మర్చిపోలేమని హమీస్ భార్య హసీన తెలిపింది.

సూపర్ స్పెషాలిటీ.. పేదల సంజీవని

- ఆస్పత్రిలో ఏడు రకాల స్పెషాలిటీ వైద్యం
- 'ప్రైవేటు'లో రూ. లక్షలు ఖర్చయ్యే సేవలు ఉచితంగా
- హర్షం వ్యక్తం చేస్తున్న పేద ప్రజలు





నెఫ్రాలజీ ఓపీ కోసం వేచి ఉన్న రోగులు, ఎండోక్రైనాలజీ ఓపీలో సేవలందిస్తున్న ప్రొఫెసర్ డాక్టర్ బ్రహ్మానందం

అనంతపురం మెడికల్: వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వంలో ఏర్పాటైన సూపర్ స్పెషాలిటీ పేదల పాలిట సంజీవనిలా మారింది. ఆస్పత్రిలో ప్రస్తుతం ఏడు రకాల స్పెషాలిటీ సేవలు ఉచితంగా అందుతున్నాయి. ప్రైవేటుగా ఇటువంటి సేవలు పొందాలంటే రూ.వేల నుంచి రూ.లక్షలు వెచ్చించాల్సి ఉంటుంది. అనంతపురంలోని జేఎన్‌టీయూకు వెళ్లే మార్గంలో ఉన్న సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిలో కార్డియాలజీ, న్యూరాలజీ, న్యూరో సర్జరీ, యురాలజీ, నెఫ్రాలజీ, ఎండోక్రైనాలజీ, సర్జికల్ గ్యాస్ట్రో ఎంటరాలజీ సేవలు అందుబాటులో ఉన్నాయి. నెఫ్రాలజీకి సంబంధించి డయాలసిస్ సేవ ఉచితంగా అందుతోంది. ఆస్పత్రిలో ఆరు డయాలసిస్ మిషన్లు ఉన్నాయి. వీటితో పాటు వివిధ రక్తపరీక్షలు, ఎక్స్‌రే, సిటీ స్కాన్ సేవలు అందుబాటులో ఉన్నాయి. కార్డియాలజీ, న్యూరో సర్జరీలు రెగ్యులర్‌గా నిర్వహిస్తుంటారు. ఖరీదైన మందులు నెలలు తరబడి ఉచితంగా అందిస్తున్నారు. ఆస్పత్రిలో వైద్యం పొందడానికి పైసా ఇవ్వాల్సిన పనిలేదు.

ఓపీ సేవలు, వాటి వివరాలు:

- సమయం: ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు
- గుండె సంబంధిత వ్యాధులకు సంబంధించి మంగళవారం, శుక్రవారం చూస్తారు.
- నడుము, వెన్నునొప్పి, తల గాయాలు, ఆపరేషన్ తర్వాత సంప్రదించేందుకు ప్రతి సోమ, గురువారాలు డాక్టర్లు ఉంటారు.
- కిడ్నీలో రాళ్లు, పొత్తి కడుపులో నొప్పి, వెన్నెముకకు ఇరువైపులా నొప్పి, మూత్రంలో రక్తం, మూత్రాశయంలో నొప్పి, మంట తదితర సమస్యలకు మంగళ, శుక్రవారాల్లో చూస్తారు.
- గ్యాస్ట్రిక్ సంబంధిత సమస్యలకు సోమవారం, గురువారం.
- కిడ్నీ సంబంధిత వ్యాధులకు బుధ, శనివారం డాక్టర్లు ఉంటారు.
- మధుమేహం(షుగర్), థైరాయిడ్, హార్మోన్ల సమస్యలకు బుధ, శనివారం.

ఉచితంగా ఖరీదైన మందులు



నా కూతురు నందినిని బెంగళూరులో బాప్టిస్ట్ ఆస్పత్రిలో కిడ్నీ సమస్యకు చూపిస్తున్నా. అక్కడికి వెళ్లినప్పుడల్లా రూ.వేలు ఖర్చు అయ్యేవి. బేల్దారి పని చేసుకునే నాకు ఇబ్బందిగా ఉండేది. సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిలో బాగా చూస్తారని చెప్పడంతో 3 నెలలుగా బిడ్డకు తీసుకొస్తున్నా. ప్రతి నెలా రూ.25,000 ఖర్చు అయ్యే మందులు ఉచితంగా ఇస్తున్నారు. ఇంతకన్నా ఏం కావాలి. పేదోళ్లకు ప్రభుత్వం చేస్తున్న సాయాన్ని మరువలేం.

– రామచంద్ర, హిందూపురం

సద్వినియోగం చేసుకోవాలి



పేద ప్రజలకు కార్పొరేట్ స్థాయి సేవలు ఉచితంగా అందుతున్నాయి. ప్రజలు ప్రైవేట్ ఆస్పత్రులకు వెళ్లకుండా ఇక్కడ పొందే సేవలను సద్వినియోగం చేసుకోవాలి. నిర్దేశిత సమయంలో వైద్యులు అందుబాటులో ఉండి ఓపీ, ఐపీ, సర్జరీ తదితర సేవలు అందిస్తారు.

– డాక్టర్ కేఎస్ఎస్ వెంకటేశ్వర రావు (సూపరింటెండెంట్, జీజీహెచ్)

స్టాఫ్‌నర్సులకు డ్రెస్సింగ్ రూం ఏర్పాటు



సర్వజనాస్పత్రిలోని గైనిక్ వార్డులో స్టాఫ్‌నర్సులకు కేటాయించిన గది

సాక్షి ఎఫెక్ట్..

అనంతపురం మెడికల్: ఎట్టకేలకు ప్రభుత్వ సర్వజనాస్పత్రిలోని స్టాఫ్ నర్సులకు డ్రస్సింగ్ రూం ఏర్పాటు చేశారు. కనీసం దుస్తులు మార్చుకునేందుకు కూడా సరైన గది లేక స్టాఫ్ నర్సులు పడుతున్న ఇబ్బందులపై ఈ నెల 17న 'సారూ..డ్రస్సింగ్ రూం చూపరూ' శీర్షికన 'సాక్షి'లో కథనం ప్రచురితమైంది. దీనిపై సూపరింటెండెంట్ డాక్టర్ కేఎస్ఎస్ వెంకటేశ్వర రావు స్పందించారు. గైనిక్ విభాగంలో ఖాళీగా ఉన్న గదిని స్టాఫ్ నర్సుల డ్రస్సింగ్ రూం కోసం కేటాయించాలని ఆర్ఎంఓ డాక్టర్ పద్మజను ఆదేశించారు. దీంతో గైనిక్ విభాగాధిపతితో మాట్లాడిన ఆర్ఎంఓ.. అదే వార్డులోని ఓ గదిని స్టాఫ్‌నర్సులకు కేటాయించేలా చూశారు. ప్రత్యేక గదిలో మౌలిక సదుపాయాలను కల్పించేలా చర్యలు తీసుకుంటామని సూపరింటెండెంట్ తెలిపారు. ఇదిలా ఉండగా వివిధ వార్డుల్లోనూ నర్సులకు డ్రసింగ్ గది లేదని, ఆయా వార్డుల్లో అల్యూమినియం డోర్లతో ప్రత్యేక గదిని ఏర్పాటు చేయాలని స్టాఫ్‌నర్సులు కోరుతున్నారు.

విత్తన రిజిస్ట్రేషన్‌కు విశేష స్పందన



సనపలో విత్తన రిజిస్ట్రేషన్ చేస్తున్న ఏఓ సుచరిత, ఏఈఓ సుజిత

ఆత్మకూరు: సబ్సిడీ విత్తన వేరుశనగ రిజిస్ట్రేషన్‌కు విశేష స్పందన లభిస్తోంది. సకాలంలో వర్షాలు కురుస్తుండటంతో వేరుశనగ సాగుకు రైతులు ఆసక్తి చూపుతున్నారు. ఇందులో భాగంగా మంగళవారం మండలంలో 485 మంది రైతులు విత్తన వేరుశనగ కోసం రిజిస్ట్రేషన్ చేసుకున్నట్లు ఏఓ సుచరిత, ఏఈఓ సుజిత తెలియజేశారు. ఈ నెల 24 నుంచి విత్తన పంపిణీ ఉంటుందని, 30 కిలోల బస్తా సబ్సిడీ పోను రూ.1710 రైతులు చెల్లించాలని తెలియజేశారు. రిజిస్ట్రేషన్ చేసుకున్న రైతులకు మాత్రమే వేరుశనగ కాయలు ఇస్తామన్నారు.

40 శాతం సబ్సిడీతో విత్తన వేరుశనగ

కనగానపల్లి: మండలంలోని అన్ని ఆర్‌బీకేలలో సబ్సిడీ విత్తన వేరుశనగ కాయల కోసం రైతులు రిజిస్ట్రేషన్ చేసుకుంటున్నట్లు ఏఓ కృష్ణకుమారి తెలిపారు. స్థానిక వ్యవసాయ కార్యాలయంలో మంగళవారం ఆమె రైతులతో మాట్లాడుతూ ఖరీఫ్‌లో వేరుశనగ సాగు చేసే రైతులకు ప్రభుత్వం 40 సబ్సిడీపై విత్తన కాయలు అందజేస్తోందన్నారు. కనగానపల్లి మండలానికి తొలి విడతగా 1000 కింటాళ్ల విత్తనం కేటాయించారన్నారు. కావలసిన రైతులు రైతు భరోసా కేంద్రాల వద్దకు వెళ్లి రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు.

భక్తిశ్రద్ధలతో నృసింహ జయంతి



పూజలందుకున్న నరసింహస్వామి



కల్యాణోత్సవంలో పాల్గొన్న భక్తజనం

అనంతపురం కల్చరల్: నరసింహస్వామి జయంతి వేడుకలు మంగళవారం వైభవంగా జరిగాయి. స్థానిక పాతూరులోని వ్యాసరాజ మఠం (చిన్నాంజనేయస్వామి ఆలయం)లో ఉదయం వివిధ దేవతామూర్తులకు ప్రత్యేక పూజలు, అలంకార సేవలు నయనానందకరంగా నిర్వహించారు. అనంతరం మన్యుసూక్త హోమాన్ని రుత్వికులు శాస్త్రోక్తంగా జరిపించారు. అనంతరం శ్రీదేవి, భూదేవి సమేత నరసింహస్వామి కల్యాణోత్సవం జరిపించారు. మంగళవాయిద్యాలు, వేదమంత్రాల నడుమ శాస్త్రోక్తంగా సాగిన కల్యాణంలో వివిధ మఠాల ప్రతినిధులు, భారీగా భక్తులు పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. సాయంత్రం ఉత్సవ మూర్తులతో నగరోత్సవం, సాంస్కృతిక కార్యక్రమాలు, స్వస్తివచనం, మహామంగళహారతి జరిగాయి. కార్యక్రమంలో ఆలయ నిర్వాహకులు రఘునాథ్, నాగరాజు, హరినారాయణ తదితరులు పాల్గొన్నారు.

కుర్ల పల్లయ్య స్వామి ఊరేగింపు



గ్రామోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం

రాప్తాడు : మండల కేంద్రం రాప్తాడులో మంగళవారం ధర్మపురి కుర్లపల్లయ్య స్వామి ఊరేగింపు వైభవంగా సాగింది. గ్రామంలో ఓ శుభకార్యం కోసం ఇంటి ఇలవేల్పు అయిన కుర్ల పల్లయ్య స్వామిని సోమవారం ధర్మవరం మండలం ధర్మపురి గ్రామం నుంచి రాప్తాడుకు తీసుకువచ్చి ప్రత్యేక పూజలు నిర్వహించారు. రాత్రంతా భక్తిశ్రద్ధలతో స్వామిని ఊరేగించారు. మంగళవారం గ్రామంలో ఊరేగించారు. భక్తులు టెంకాయలు కొట్టి మొక్కులు తీర్చుకున్నారు.

అంతా మా ఇష్టం



మెడికో లీగల్ కేసుకు విద్యార్థులే ఎక్స్‌రే తీస్తున్న దృశ్యం, చిత్రంలో రోగి బంధువు సెలైన్ బాటిల్ పట్టుకున్న దృశ్యం



ఎఫ్ఎం వార్డులో అడ్మిషన్‌లో ఉన్న లక్ష్మీదేవిని సిటీ స్కాన్‌కు తీసుకెళ్తున్న వారి బంధువులు

- ఇష్టారాజ్యంగా ఎంఎన్ఓ, ఎఫ్ఎన్ఓ విధులు
- ఆర్ఎంఓల బాధ్యతారాహిత్యం
- జీజీహెచ్‌కు స్పెషలాఫీసర్ ఆవశ్యకత తప్పనిసరి

అనంతపురం మెడికల్: ప్రభుత్వ సర్వజనాస్పత్రిలో రెసిడెన్షియల్ మెడికల్ ఆఫీసర్ల బాధ్యతారాహిత్యం రోగులకు, వారి సహాయకులకు శాపంగా మారుతోంది. వివిధ వార్డుల్లో రౌండ్ ద క్లాక్ పర్యటిస్తూ, రోగులకందాల్సిన సేవల్లో ఎటువంటి జాప్యం జరగకుండా చూడాల్సిన అధికారులు మీనామేషాలు లెక్కిస్తున్నారు. దీంతో ఆస్పత్రిలోని పలు వార్డుల్లో మేల్ నర్సింగ్ ఆర్డర్లీ, ఫీమేల్ నర్సింగ్ ఆర్డర్లీ (రోగులను స్ట్రెచర్లపై వార్డులకు తీసుకెళ్లే సిబ్బంది) ఇష్టారాజ్యంగా విధులు నిర్వర్తిస్తున్నారు. ఆస్పత్రిలో ఎమర్జెన్సీ, అక్యూట్ మెడికల్ కేర్ యూనిట్(ఏఎంసీ), మేల్ మెడిసిన్, ఫీమేల్ మెడిసిన్, ఐసీసీయూ, సర్జరీ, ఆర్థో, ఈఎన్‌టీ, చెస్ట్, గైనిక్, లేబర్, తదితర వార్డుల్లో రోగులను ఎప్పటికప్పుడు ఎక్స్‌రే, సిటీ స్కాన్, ఎంఆర్ఐ స్కాన్, అల్ట్రాసౌండ్, తదితర విభాగాలకు తీసుకెళ్లాలి. కానీ పలు చోట్ల పలువురు ఎంఎన్ఓ, ఎఫ్ఎన్ఓలు సిబ్బంది పత్తా లేకుండా పోతున్నారు. వీరిని పర్యవేక్షించే వారే కరువయ్యారు. దీంతో రోగి సహాయకులే రోగులను వార్డులకు తీసుకెళ్లాల్సిన దయనీయమైన పరిస్థితి నెలకొంది. మొదటి, రెండో అంతస్తుల నుంచి రోగులను అనుభవం కల్గిన వారు తీసుకెళ్తే ఎటువంటి ఇబ్బంది ఉండదు. కానీ కొన్ని సార్లు సిబ్బంది అందుబాటులో లేకపోవడంతో రోగి సహాయకులు అష్టకష్టాలు పడుతూ వార్డులకు తీసుకెళ్తున్నారు.

సిబ్బందిపై చర్యలేవీ...?

ఆస్పత్రిలో పలువురు సిబ్బంది వ్యవహరిస్తున్న తీరు ఇటు వైద్యులు.. అటు ఉన్నతాధికారులను ఆశ్చర్యానికి గురి చేస్తోంది. విధి నిర్వహణలో నిర్లక్ష్యంగా వ్యవహరించినట్లు సంబంధిత వైద్యులు లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేసినా, సూపరింటెండెంట్, ఆర్ఎంఓలు ఎటువంటి చర్యలు తీసుకోవడం లేదు. ప్రేక్షకపాత్ర వహిస్తూ మొదటి తప్పు, రెండో తప్పు అన్నట్లు వదిలేస్తున్నారు. వైద్యులపై తిరగబడ్డా, తమకేం పట్టదన్నట్లు వ్యవహరిస్తున్నారు.

స్పెషలాఫీసర్ తప్పనిసరి!

ఉమ్మడి జిల్లాలో పేద ప్రజలకు ప్రభుత్వ సర్వజనాస్పత్రి పెద్ద దిక్కు. రోజూ 2 వేల నుంచి 2,500 మందికి ఓపీ సేవలు, 1,300 మంది అడ్మిషన్లు జరుగుతున్నాయి. ప్రత్యక్షంగా, పరోక్షంగా 3 వేల నుంచి 4వేల మంది సేవలు పొందుతున్నారు. ఇది కాకుండా రోగులను చూసేందుకు వెయ్యి నుంచి 1,500 మంది వస్తుంటారు. ఇలా ఆస్పత్రి రోగులు, వారి సహాయకులతో ఆస్పత్రి కిక్కిరిసి పోతుంటుంది. వైద్యులు, స్టాఫ్‌నర్సులు, పారా మెడికల్ సిబ్బంది, ఎంఎన్ఓ, ఎఫ్ఎన్ఓ తదితరులు అందిస్తున్న సేవలు, బ్లడ్ బ్యాంకు, ఎక్స్‌రే, సిటీ స్కాన్, ఎంఆర్ఐ స్కాన్, ఆల్ట్రాసౌండ్ తదితర విభాగాల్లో అందుతున్న సేవలపై అధికారుల పర్యవేక్షణ తప్పక ఉండాలి. ఆస్పత్రిలో ఎప్పటికప్పుడు పర్యవేక్షించాల్సిన అధికారులు ప్రేక్షకపాత్ర పోషిస్తున్నారు. కోవిడ్ సమయంలో ప్రభుత్వం ప్రత్యేక చొరవతో జీజీహెచ్‌కు అప్పట్లో అసిస్టెంట్ కలెక్టర్‌గా సూర్యను నియమించారు. ఇప్పుడు అదే స్థాయిలో ఓ స్పెషలాఫీసర్‌ను నియమిస్తే, ఆస్పత్రిలో రోగులకందే సేవల్లో నాణ్యత పెరిగే అవకాశం లేకపోలేదు. ఎవరి విధులు వారు చేసుకునేందుకు వీలుగా ఉంటుంది. ఆ దిశగా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్ చర్యలు తీసుకోవాలని ఆస్పత్రి సిబ్బంది చెబుతున్నారు.

వర్షాలతో ఊరట

చెన్నేకొత్తపల్లి : ఎండలతో అల్లాడిపోయిన జనం ఇటీవల వరుసగా కురుస్తున్న వర్షాలతో ఉపశమనం పొందుతున్నారు. సోమవారం రాత్రి 10.04 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైంది. పశువులకు గ్రాసం కొంత వరకు తీరుతుందని గొర్రెలు, మేకలు, ఇతర పాడిపశువుల యజమానులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

పాలిటెక్నిక్ విద్యార్థులకు ఇంటర్న్‌షిప్

అనంతపురం: అనంతపురం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో డిప్లొమో (మెకానికల్ విభాగం) ఫైనలియర్ విద్యార్థులకు 'మస్సాచు సిమిచు' కంపెనీలో ఆరు నెలల పాటు ఇంటర్న్‌షిప్ అందించనున్నారు. ఇంటర్న్‌షిప్ కాలంలో నెలకు రూ.18,000 స్టైఫండ్ ఉచిత బోధన, రవాణ సౌకర్యం, ఉచిత బీమా, యూనిఫాం అందిస్తారని ప్రిన్సిపాల్ సి. జయచంద్రా రెడ్డి తెలిపారు. శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని విద్యార్థులకు సూచించారు.

ఈదురు గాలులతోనేలకొరిగిన చెట్లు



రెండో రోడ్డులో సహాయక కార్యక్రమాలను పర్యవేక్షిస్తున్న మేయర్ వసీం, డిప్యూటీ మేయర్ కోగటం

అనంతపురం కార్పొరేషన్: నగరంలో సోమవారం రాత్రి కురిసిన గాలీవానకు 2,3,4,5 రోడ్లతో పాటు 50వ డివిజన్, ఒకటో డివిజన్, 32వ డివిజన్ తదితర ప్రాంతాల్లో పెద్ద సంఖ్యలో చెట్లు నేలకూలాయి. దీంతో రాకపోకలకు ఇబ్బందులు తలెత్తాయిగాయి. మేయర్ వసీం, డిప్యూటీ మేయర్ కోగటం విజయభాస్కర్ రెడ్డి ఆ ప్రాంతాల్లో మంగళవారం పర్యటించి నేలకొరిగిన చెట్లను తొలగించేలా చర్యలు తీసుకున్నారు. నగరంలో పారిశుద్ధ్య సమస్య తలెత్తకుండా చూడాలని నగరపాలక సిబ్బందిని ఆదేశించారు. వర్షాలను దృష్టిలో ఉంచుకుని వేగవంతంగా పూడిక తీత పనులు చేపట్టాలన్నారు. వర్షపు నీరు సరిగా వెళ్లేందుకు కాలువల్లో పూడిక, చెత్తా చెదారాన్ని తొలగించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కార్పొరేటర్లు శేఖర్ బాబు, కమల్‌భూషణ్, టీవీ చంద్రమోహన్ రెడ్డి, మునిశేఖర్, లాలూ, నాయకులు రాధాకృష్ణ, రామచంద్ర, కాకర్ల శ్రీనివాస్ రెడ్డి, తదితరులున్నారు.





హౌసింగ్ బోర్డు బ్యాంకు కాలనీలో బైక్‌పై పడిన చెట్టు, విరిగిపడిన విద్యుత్ స్తంభం



నేలకొరిగిన వృక్షం



గాలీవానకు కూలిన చెట్టు, స్తంభం